క్లుప్తంగా

మంత్రి కోమటిరెడ్డిని కలిసిన భూ నిర్వాసితులు



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో మాట్లాడుతున్న భూ నిర్వాసితులు

చిట్యాల : మండలంలోని నేరడ గ్రామానికి చెందిన పలువురు రైతులు బ్రహ్మణవెల్లెంల ఉదయ సముద్రం ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోనున్నారు. దీంతో తమకు తగిన న్యాయం చేయాలని కోరుతూ శనివారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వాటర్స్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని భూ నిర్వాసితులు కలిశారు. కలిసిన వారిలో ఓర్సు సత్యనారాయణతో పాటుగా నార్కట్‌పల్లి మండల పార్టీ అధ్యక్షుడు ఊషయ్య తదితరులున్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సమస్యలు విన్నవిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్ : సీఎం రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్యే వేముల వీరేశం శనివారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

చౌడంపల్లి చెరువు నింపాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

నార్కట్‌పల్లి : మండల పరిధిలోని బ్రాహ్మణవెల్లంల ఉదయసముద్రం రిజర్వాయర్ నుంచి చౌడంపల్లి చెరువును నింపాలని శనివారం ఆ గ్రామస్తులు కలెక్టర్ త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు. అదే విధంగా ప్రాజెక్టు ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, డీఈ విఠలేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ఉపసర్పంచ్ దామెర ఉదయ్‌కుమార్, భగవంత్‌రెడ్డి, నర్సిరెడ్డి, వెంకట్‌రెడ్డి, చంద్రయ్య, రామలింగయ్య, లింగయ్య, గోపాల్ ఉన్నారు.

వృద్ధులు జాగ్రత్తలు పాటించాలి



వృద్ధులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేస్తున్న జడ్జి మంజుల సూర్యావర్

నకిరేకల్ : వృద్ధాశ్రమంలో ఉంటున్న వృద్ధులు చలికాలంలో తగు జాగ్రత్తలు పాటించాలని నకిరేకల్ మున్సిఫ్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి కుమారి మంజుల సూర్యావర్ సూచించారు. శనివారం మండలంలోని తాటికల్ శివారులో గల లయన్స్ వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వృద్ధుల బాగోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బిచినేపల్లి ప్రకాష్‌రావు, ఆశ్రమం చైర్మన్ ఎస్.రాంమోహన్‌రావు పాల్గొన్నారు.

యాదప్రియకు అవార్డు



మంత్రి సీతక్క చేతుల మీదుగా రాష్ట్రస్థాయి అవార్డు అందుకుంటున్న యాదప్రియ

నకిరేకల్ : మండలంలోని కడపర్తి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు నడికుడి యాదప్రియకు రాష్ట్ర స్థాయి మహిళా ప్రతిభా పురస్కారం లభించింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మంత్రి సీతక్క, రాజ్యసభ మాజీ సభ్యుడు హనుమంతరావు, సావిత్రిబాయి పూలే ఉత్సవ కమిటీ చైర్‌పర్సన్ మణిమంజరి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

సేవాదళ్ అధ్యక్షుడిగా విష్ణు

చండూరు : కాంగ్రెస్ సేవాదళ్ నియోజకవర్గం అధ్యక్షుడిగా పెండ్యాల విష్ణు, ఉపాధ్యక్షుడిగా దోనాల శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడిగా కోలుగురి అనిల్‌ను నియమిస్తూ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం మండల కేంద్రంలో వారికి ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సాగర్‌రెడ్డి, ఓంకారం, వెంకన్న ఉన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన

- ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్



శాలిగౌరారంలో మాట్లాడుతున్న ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

నకిరేకల్ (శాలిగౌరారం) : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన అందిస్తున్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శనివారం శాలిగౌరారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్ పాల్గొని మాట్లాడారు. ముందుగా ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు పరుచడమే కాంగ్రెస్ ప్రభుత్వ ఏకైక లక్ష్యమన్నారు. అనంతరం ఎమ్మెల్యే మందుల సామేల్ మాట్లాడారు. అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిన తుంగతుర్తి నియోజకవర్గాన్ని అభివృద్ధి పరిచేందుకు సంవత్సరం లోనే రూ.1203కోట్ల నిధులు తెచ్చినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ పాలనలో నాటి పాలకులు వనరుల దోపిడీకి పాల్పడ్డారే తప్ప నియోజకవర్గాన్ని పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నరిగె నర్సింహ, సింగిల్‌విండో చైర్మన్ తాళ్లూరి మురళి, జిల్లా మార్కెటింగ్ అధికారి ఛాయాదేవి, తహసీల్దార్ యాదగిరి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సుధాకర్, మండల వ్యవసాయ అధికారి సౌమ్యశృతి, మార్కెట్ కార్యదర్శి చీనానాయక్, డీసీసీ నాయకులు అన్నెబోయిన సుధాకర్, గూని వెంకటయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌సీ సాధనలో యూటీఎఫ్ పాత్ర కీలకం

- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



నల్లగొండ : జెండా ఊపి జాతాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

నల్లగొండ : పీఆర్‌సీ సాధనలో యూటీఎఫ్ పాత్ర కీలకమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) 50 ఏళ్లు అవుతున్న సందర్భంగా కాకినాడలో జరిగే స్వర్ణోత్సవాలకు వెళ్లే 11వ జాతాను శనివారం నల్లగొండలోని టీఎస్‌యూటీఎఫ్ భవనం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు హైదరాబాద్ నుంచి వచ్చిన 9వ జాతకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1974లో ఏర్పడిన యూటీఎఫ్ ఉపాధ్యాయులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి వారి సంక్షేమం, విద్యా రంగ పరిరక్షణకు 50 ఏళ్లుగా కృషి చేస్తోందన్నారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి మాట్లాడుతూ కాకినాడలో జరిగే స్వర్ణోత్సవ మహాసభకు పతాక జాతలు కాకినాడకు వెళ్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.వెంకట్ మాట్లాడుతూ ప్రజాగొంతుక అయిన నర్సిరెడ్డి గెలుపునకు కృషి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు రాజశేఖర్‌రెడ్డి, నాగమణి, శాంతికుమారి, శ్రీధర్, వెంకటప్ప, రవికుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బక్కా శ్రీనివాసచారి, పెరుమాళ్ల వెంకటేశం, నాయకులు ఎడ్ల సైదులు, మొర్తాల శ్రీనివాస్‌రెడ్డి, నలపరాజు వెంకన్న, రేగ నర్సింహ, నల్ల నర్సింహ, కుమ్రరాజు సైదులు, యాదయ్య, నర్సింహ, విద్యాసాగర్‌రెడ్డి, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు కృషి

నకిరేకల్ : ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం టీఎస్ యూటీఎఫ్ కృషిచేస్తోందని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చావ రవి, ఎస్.వెంకట్ అన్నారు. కాకినాడలో జరిగే సంఘం స్వర్ణోత్సవం మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన జాతా శనివారం పట్టణానికి చేరుకుంది. ఈ జాతకు నకిరేకల్, కేతేపల్లి, శాలిగౌరారం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.శ్రీనివాస్‌చారి, పి.వెంకటేషం, ఆయా మండలాల అధ్యక్ష, కార్యదర్శులు టి.నర్సింహామూర్తి, కె.శ్రీనివాస్, రవికుమార్, జయసాగర్, తిరుమలయ్య, హరికృష్ణ, భద్రయ్య, ఉపేందర్‌రెడ్డి, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

ముంపు బాధితులకు పూర్తి ప్యాకేజీ అందించాలి

మర్రిగూడ : మండలంలోని శివన్నగూడ రిజర్వాయర్ ముంపు బాధితులకు పూర్తి స్థాయిలో ప్యాకేజీ అందించి సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ ఓబీసీ రాష్ట్ర కోఆర్డినేటర్ ముద్దం నరసింహాగౌడ్ అన్నారు. శనివారం ఆయన హైదరాబాద్‌లో రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గత ప్రభుత్వం పూర్తి ప్యాకేజీ అందించకుండానే రిజర్వాయర్ పనులు చేపట్టిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి శివన్నగూడ, నర్సిరెడ్డిగూడెం, చర్లగూడ, వెంకేపల్లి, వెంకేపల్లితండా ప్రజలకు పూర్తి స్థాయిలో పరిహారాన్ని అందించి ఆదుకోవాలని కోరారు. అందుకు స్పందించిన మంత్రి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

నల్లగొండ టూటౌన్ : మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, డ్వాక్రా కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించి అమలు చేయాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు ఎండీ.సలీం డిమాండ్ చేశారు. శనివారం యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నల్లగొండలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, మాజీ కౌన్సిలర్ అవుట రవీందర్, కోట్ల అశోక్‌రెడ్డి, పేర్ల సంజీవ, పాలడుగు వెంకటేశం, జీడిమెట్ల నర్సింహ, కత్తుల కృష్ణవేణి, దాసరి లక్ష్మమ్మ, ఎల్లమ్మ పాల్గొన్నారు.

రామాలయంలో ఆకట్టుకున్న నృత్యప్రదర్శనలు



నృత్య కళాకారులకు బహుమతులు అందజేస్తున్న బుర్రి చైతన్య, ప్రవచకులు, వికాస తరంగిణి సభ్యులు

రామగిరి (నల్లగొండ) : ధనుర్మాసోత్సవాల్లో భాగంగా రామగిరి శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో శనివారం హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ వట్టికోట యాదగిరాచార్యుల బృందం ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కళాకారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రవచకులు భాష్యం జగన్నాథచార్యులు, పురుషోత్తమచార్యులు, కౌన్సిలర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి, మహిళా ఆరోగ్య వికాస్ కోఆర్డినేటర్ ఎర్రమాద సుజాత, వికాస తరంగిణి అధ్యక్షురాలు చొక్కారపు మాధవి, కార్యదర్శి ఈశ్వర్‌రెడ్డి, రాజేష్, అక్కినెపల్లి పద్మ, చకిలం వేణుగోపాల్‌రావు, సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

గుత్తాను కలిసిన ఎస్పీ



గుత్తా సుఖేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్పీ

నల్లగొండ టూటౌన్ : పట్టణంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని శనివారం ఎస్పీ శరత్ చంద్ర పవార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు ఎస్పీ పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

సుఖేందర్‌రెడ్డిని కలిసిన లచ్చిరాం

నల్లగొండ : నేషనల్ జ్యూరీకి ఎంపికైన ఉపాధ్యాయుడు ఉదావత్ లచ్చిరాం శనివారం స్థానికంగా శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా సుఖేందర్‌రెడ్డికి నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా వారి పుస్తకాన్ని అందజేసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు.

యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



గట్టుప్పల్‌లో యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ

చండూరు(గట్టుప్పల్) : గట్టుప్పల్ మండల కేంద్రంలో టీ ఎస్ యూటీఎఫ్ నూతన సంవత్సరం క్యాలెండర్, డైరీని మండల విద్యాధికారి జోగుల అమృతాదేవి, సంఘం జిల్లా కార్యదర్శి కాశిరెడ్డి కృష్ణారెడ్డితో కలిసి శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి బూరుగు వెంకటేశ్వర్లు, బి.పురుషోత్తంరాజు, లింగస్వామి, జె.పార్వతమ్మ, జ్యోతిబాల, సీహెచ్.రాము, పరమేష్, గణేష్, శ్రీనివాస్‌రెడ్డి, మమత పాల్గొన్నారు.

కేతేపల్లి : మండల కేంద్రంలో శనివారం టీఎస్ యూటీఎఫ్ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను కాంప్లెక్స్ హెచ్‌ఎం వై.నర్సిరెడ్డి సంఘం ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు బి.మధు, ప్రధాన కార్యదర్శి పి.జయసాగర్, కోశాధికారి వి.గోపయ్య, ఐ.మనోహర్, యాదగిరి, వెంకటేషం, రంజని, సైదులు, రాజశేఖర్, అశ్విని, ఉపేంద్రకుమారి పాల్గొన్నారు.

నల్లగొండ : మునుగోడు మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం 2025 క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీజీఓ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎండీ.ముజీబుద్దీన్, మిషన్ భగీరథ ఎస్‌ఈ డి.వెంకటేశ్వర్లు, భువనగిరి ఎస్‌ఈ వై.కృష్ణయ్య, ఈఈలు శాంతికుమారి, కరుణాకర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో సాందీప్ పాఠశాల చైర్మన్ సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యాయులు

నల్లగొండ టూటౌన్ : అంతర్జాతీయ సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ వారు 2024–25 సంవత్సరానికి నల్లగొండలోని సాందీప్ హైస్కూల్‌కు చెందిన 19మంది విద్యార్థులు లెవల్-1లో బంగారు పతకాలు సాధించినట్లు పాఠశాల చైర్మన్ జి.సత్యనారాయణరెడ్డి శనివారం తెలిపారు.

ఒలింపియాడ్‌లో ఓక్‌ట్రీ విద్యార్థుల ప్రతిభ

రామగిరి(నల్లగొండ) : ఇంటర్నేషనల్ సైన్స్ ఒలింపియాడ్‌లో పట్టణానికి చెందిన ఓక్ ట్రీ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల చైర్మన్ గింజల నరేందర్‌రెడ్డి తెలిపారు. 14మంది సెకండ్ లెవల్‌కు అర్హత సాధించారన్నారు.

సోషల్ టాలెంట్‌టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ

నకిరేకల్(శాలిగౌరారం) : నల్లగొండ పట్టణంలో శనివారం జరిగిన సోషల్ టాలెంట్ టెస్ట్‌లో శాలిగౌరారం మండలంలోని వల్లాల మోడల్‌స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి బహుమతులు సాధించారు. పాఠశాలకు చెందిన పి.పవిత్ర జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిల్వగా, సౌమ్య మూడవ స్థానంలో నిలిచారు. అదేవిధంగా పద్మారావు, పూజ మంచి ప్రతిభ కనబరిచి బహుమతులు, ప్రశంసాపత్రాలను పొందారు. ఈ సందర్భంగా విద్యార్థులను, ఉపాధ్యాయులను పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, ఉపాధ్యాయులు అభినందించారు.

మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి



హరీశ్‌రావుతో చిరుమర్తి లింగయ్య, బండ నరేందర్‌రెడ్డి

నకిరేకల్ : హైదరాబాద్‌లో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావును శనివారం మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, జెడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

మాజీ మంత్రులు జైలుకు వెళ్లడం ఖాయం

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు : బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మంత్రులుగా పనిచేసిన కేటీఆర్‌తో పాటు ఇతర మంత్రులంతా అతి త్వరలో జైలుకు వెళ్లడం ఖాయమని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మునుగోడులోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతో మంది ప్రాణత్యాగాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని పది ఏళ్ల పాటు పాలించిన బీఆర్‌ఎస్ నాయకులు రాష్ట్ర ఖజానాలోని లక్షల కోట్ల రూపాయలను పథకాల పేరుతో దొచుకున్నారని ఆరోపించారు. కొంత ఆలస్యమైనా వారి అందరిని జైళ్లకు పంపడం ఖాయమన్నారు. ప్రపంచంలోనే అత్యధికంగా ఫ్లోరిన్ సమస్యల ఉన్న మునుగోడు నియోజకవర్గంలో మిషన్ భగీరథ ద్వారా అధికమైందే తప్పా తగ్గలేదని, దానిని పూర్తిగా నివారించేందుకు సాగునీరు ఒక్కటే మార్గం అన్నారు. గ్రామాల్లో బెల్టు దుకాణాలను మూసివేయించానన్నారు. స్థానిక ఎన్నికల్లో ఏ ఒక గ్రామంలో బీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలవరని, ప్రతి గ్రామంలో కాంగ్రెస్ సర్పంచ్, ఎంపీటీసీలు గెలుస్తారని అన్నారు. ఆయన వెంట డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

విద్యా, వైద్య సమస్యలు పరిష్కరించాలి

నియోజకవర్గంలో ఏ గ్రామంలోనైనా విద్యా, వైద్యానికి సంబంధించిన సమస్యలు తలెత్తితే వాటిని వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో జిల్లా విద్యా, వైద్య, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో వేర్వేరుగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యా, వైద్యం పేదలకు అందితే అందరి ఆర్థిక పరిస్థితి బాగుంటుందన్నారు. అందుకు నా నుంచి సహాయ, సహకారాలు, ప్రభుత్వం నుంచి అవసరమైన నిధులు మంజూరు చేయించడంతో ముందుటానన్నారు. అదే విధంగా నియోజకవర్గంలో మళ్లీ ఫ్లోరిన్ చాయలు కన్పిస్తున్నందున దానిని నివారించేందుకు అధికారులు దృష్టి పెట్టాలన్నారు. సమీక్ష సమావేశంలో నల్లగొండ, భువనగిరి డీఎంహెచ్‌ఓ పుట్ల మధు, మనోహర్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కళ్యాణ్‌చక్రవర్తి, నల్లగొండ, భువనగిరి ఆర్‌డబ్ల్యూఎస్ సీఈ వెంకటేశ్వర్లు, కృష్ణయ్య, ఈఈ కరుణాకర్, శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రచారానికే పరిమితమైన కాంగ్రెస్ ప్రభుత్వం

- మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్



మాట్లాడుతున్న బూర నర్సయ్యగౌడ్

నల్లగొండ టూటౌన్ : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైందని, పథకాలు అమలు చేయకుండా కేవలం ప్రచారానికే పరిమితమైందని మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. శనివారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు భరోసా అమలుపై మంత్రులు రోజుకో ప్రకటన చేస్తున్నారని అన్నారు. రుణమాఫీ ఎగ్గొట్టినట్టుగానే రైతు భరోసాకు ఎగనామం పెట్టేందుకు ప్రయత్నిస్తుందన్నారు. రీజినల్ రింగ్‌రోడ్ భూసేకరణ విషయంలో మంత్రి కోమటిరెడ్డి స్పష్టత లేకుండా మాట్లాడుతున్నారని, యాదాద్రి వరకు మెట్రో పొడిగించాలని మంత్రి కోమటిరెడ్డి ఎందుకు సీఎంను ప్రశ్నించడం లేదన్నారు. కాంగ్రెస్ అబద్ధపు హామీలు ఇచ్చి అమలు చేయకుండా మహిళలను, రైతులను, నిరుద్యోగులను, ప్రజలను మోసం చేసిందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను బొందపెట్టి బీజేపీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. కేంద్ర నిధులతో గ్రామపంచాయతీలను అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. ఏడాది దాటినా ఒక్కరి కూడా రేషన్ కార్డు ఇవ్వలేదని, హాస్టల్స్‌లో విద్యార్థులు చనిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసాకి సంబంధించి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.35వేల కోట్ల భాకి ఉందని, వెంటనే రైతులకు ఆ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌గౌడ్, యెరెడ్ల శ్రీనివాస్‌రెడ్డి, లాలూనాయక్, పిల్లి రామరాజుయాదవ్, పోతెపాక సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి



చిట్యాలలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

చిట్యాల : అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను పూర్తి చేసి అర్హులకు పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని వట్టిమర్తి, చిట్యాల మున్సిపాలిటీలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చిట్యాలలో 242, వట్టిమర్తిలో 100, గుండ్రాంపల్లిలో 60 డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఆరేళ్ల క్రితం నిర్మాణాలు ప్రారంభించినా నేటి వరకు పూర్తి చేయలేదన్నారు. వెంటనే డబుల్ బెడ్‌రూం ఇళ్లను పూర్తి చేసి పంపిణీ చేయకపోతే పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, జిట్ట సరోజ, పార్టీ మండల సహాయ కార్యదర్శి కత్తుల లింగస్వామి, నాయకులు బొబ్బలి సుధాకర్‌రెడ్డి, గుడిసె లక్ష్మీనారాయణ, అక్కెనపల్లి నాగయ్య, ఐతరాజు యాదయ్య, జిట్ట స్వామి, నరేష్, రాములు, గణేష్, సుగుణమ్మ, అండాలు, వెంకన్న ఉన్నారు.

ఎంపికైన వారికి 'డబుల్' ఇళ్లు ఇవ్వాలి

నల్లగొండ టౌన్ : లాటరీ ద్వారా ఎంపికైన లబ్దిదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఇవ్వాలని సీపీఎం పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో అవుట రవీందర్, ఎండీ సలీం, తుమ్మల పద్మ, నర్సింహ, భిక్షపతి, లతీఫ్, శ్రీనివాస్, సుజాత, పిచ్చమ్మ, రజని, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

తిప్పర్తి : ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసి అర్హులైన వారికి కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను శనివారం నాయకులతో కలిసి సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం నిరుపేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టి ఇస్తామని నేటికి వాటిని పూర్తి చేయలేదని, 90శాతం మేర పూర్తైన ఇళ్లు మిగిలిన నిర్మాణం పూర్తి చేసి పేదలకు పంపిణీ చేయాలన్నారు. ఆయన వెంట నాయకులు మన్నెం భిక్షం, గణేష్, రాములు, వెంకన్న, ఆకిటి లింగయ్య, సైదులు, ఉమ, మంగమ్మ, గోవర్ధన్‌రెడ్డి, శరత్ తదితరులు పాల్గొన్నారు.



మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జునరెడ్డి

సంక్షిప్త సమాచారం

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ : పట్టణంలో 11కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏడీఈ వేణుగోపాలచార్యులు శనివారం తెలిపారు. మిర్యాలగూడరోడ్డు, ప్రకాశంబజార్, మాన్యంచెల్క ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు, అందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

లూయిస్ బ్రెయిలీకి నివాళి

నల్లగొండ టూటౌన్ : పట్టణంలోని గొల్లగూడలో గల సూరదాస్ భవన్‌లో శనివారం డ్వాబ్ ఆధ్వర్యంలో లూయిస్ బ్రెయిలీ 216వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రతీక్ ఫౌండేషన్ సీఈఓ ఎంవీ.గోనారెడ్డి పాల్గొని బ్రెయిలీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డ్వాబ్ ప్రధాన కార్యదర్శి పానుగోటి చొక్కారావు, ఉపాధ్యక్షుడు దామోదర్‌రావు, నాగులవంచ వెంకటేశ్వర్‌రావు, అశ్వని పాల్గొన్నారు.

ఉత్కంఠగా కేవీఆర్ కప్ క్రికెట్ పోటీలు

నల్లగొండ : పట్టణంలోని ఎన్జీ కళాశాల మైదానంలో కేవీఆర్ కప్ టోర్నమెంట్ సీజన్-1 క్రికెట్ పోటీలు ఉత్కంఠ భరితంగా జరుగుతున్నాయి. శనివారం గోల్డెన్ లెవెన్ – యువ ఫ్లెక్సీ జట్ల మధ్య జరిగిన పోటీలో గోల్డెన్ లెవెల్ జట్టు తరఫున మున్సిపల్ కమిషనర్ ముసాక్ అహ్మద్, 21వ వార్డు కౌన్సిలర్ ఇబ్రహీం పాల్గొని క్రికెట్ ఆడారు. కార్యక్రమంలో నిర్వాహకులు నంధ్యాల వీరబ్రహ్మానందరెడ్డి, రాకేష్, అశోక్, నరేందర్‌యాదవ్, సాయి పాల్గొన్నారు.

ఆర్‌టీఏ సభ్యుడిగా రాజిరెడ్డి

కనగల్ : మండలంలోని చర్లగౌరారం గ్రామానికి చెందిన కూసుకుంట్ల రాజిరెడ్డి రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (ఆర్‌టీఏ) సభ్యుడిగా నియమితులయ్యారు. జిల్లా నుంచి రాజిరెడ్డిని నియమిస్తూ శనివారం తెలంగాణ రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. రాజిరెడ్డి నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

11మంది బైండోవర్

నార్కట్‌పల్లి : పట్టణంలోని బస్టాండ్ పక్కన వివాదాస్పదంగా ఉన్న 18గుంటల కూరగాయల మార్కెట్ స్థలం గురించి ఎటువంటి ఘర్షణలు, వివాదాలు తలెత్తకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తగా ఇరువర్గాలకు చెందిన 11మందిని తహసీల్దార్ ఎదుట రూ.5లక్షల పూచికత్తుపై బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ శనివారం తెలిపారు.

ఇసుక లారీల పట్టివేత

కట్టంగూర్: అధిక లోడ్‌తో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఏడు లారీలను శనివారం విజిలెన్స్, మైనింగ్, రవాణాశాఖ అధికారులు పట్టుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం నుంచి హైదరాబాద్‌కు అధిక లోడ్‌తో లారీలో ఇసుకను తరలిస్తుండగా మండల కేంద్రం శివారులో తనిఖీ నిర్వహించి పట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో అప్పజెప్పినట్లు ఎస్‌ఐ రవీందర్ తెలిపారు.

క్రీడా దుస్తుల అందజేత

కనగల్ : మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్ విద్యార్థులకు గ్రామానికి చెందిన ఏటెల్లి సైదులుయాదవ్ తన సొంత ఖర్చులతో రూ.20వేలతో 40మంది విద్యార్థులకు శనివారం క్రీడా దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ భద్రయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాస్, జగదీష్, రాజేందర్, రామకృష్ణ పాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యాయులకు సన్మానం

నకిరేకల్ : సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని టీఎస్ యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో నకిరేకల్, కేతేపల్లి, శాలిగౌరారం మండలాల ప్రభుత్వ మహిళా ఉపాధ్యాయులను శనివారం సన్మానించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి యాట మధుసూదన్‌రెడ్డి, మహిళా కన్వీనర్ బి.శ్రీలత, ఆయా మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు నర్సింహామూర్తి, కె.శ్రీనివాస రవి, జయసాగర్ పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్స్ అందజేత

చిట్యాల : మండలంలోని వట్టిమర్తి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని ఐదోతరగతి గురుకుల పాఠశాలలో చేరేందుకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను శనివారం ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు మేడి హరికృష్ణ అందజేశారు.

ఐద్వా సభ్యత్వ నమోదు

తిప్పర్తి : మండల కేంద్రంలో శనివారం ఐద్వా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మాలి భార్గవి, జంజిరాల ఉమ, ఝాన్సీ, విజయ, రాములమ్మ, జోతి, సుజాత పాల్గొన్నారు.